
స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు



















ఘనంగా హర్ ఘర్ కా తిరంగా





రాపూరు: 150 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న చిన్నారులు, పులికాట్ సరస్సులో పడవపై జాతీయ జెండాను రెపరెపలాడిస్తున్న ఇరకం విద్యార్థులు

సూళ్లూరుపేట: పట్టణంలోని వీఎస్‌ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు బుధవారం హర్ ఘర్ తిరంగా, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్స్ కళాశాల నుంచి షార్ బస్టాండ్ వరకు ఫ్లాగ్ మార్చ్ చేశారు. ప్రిన్సిపాల్ ఎస్‌ఎల్‌బీ శంకర్ శర్మ మాట్లాడుతూ యువత మీదే దేశ భవిష్యత్తు ఆధార పడి ఉందన్నారు. యువత దేశభక్తిని పెంపొందించుకుని దేశానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని సూచించారు. సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం పరీక్షా నిర్వహణ విభాగాన్ని ప్రిన్సిపాల్ ఎస్‌ఎల్‌బీ శంకరవర్మ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా లభించడంతో పరీక్షల నిర్వహణ విధానం ఆ విభాగం చేతుల మీదుగానే జరుగుతుందని చెప్పారు. ఈ విభాగానికి కంట్రోలర్ ఆఫ్ ద ఎగ్జామినేషన్ డాక్టర్ వీ రాజా, అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా ఏ శ్రీనివాసులు నియమితులయ్యారని తెలిపారు.

ప్రతి ఇంటిపైనా త్రివర్ణ పతాకం ఎగరాలి

సైదాపురం: ప్రతి ఇంటిపైనా జాతీయ జెండాను ఎగురవేద్దామని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ కోరారు. సైదాపురంలోని గోగినేని వెంకటసుబ్బానాయుడు ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు బుధవారం జాతీయ జెండాలతో ర్యాలీ చేశారు. కార్యక్రమాల్లో ఏపీఎం రాధ, హెచ్‌ఎం, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కలువాయిలో..

కలువాయి: మండలంలోని కుల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి జయకిశోర్ ప్రజల్లో జాతీయత, దేశభక్తి పెంపొందించేందుకు ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ మహబూబ్‌బాషా, ఏజీఎంసీ వెంకటకృష్ణ, అధ్యాపకులు సురేష్, రామాంజనేయులు, శ్రీనివాసులు, పెంచలయ్య, సౌజన్య, కల్పన, సుప్రజ పాల్గొన్నారు.

150 అడుగుల త్రివర్ణ పతాకం ప్రదర్శన

రాపూరు: స్వాతంత్య్ర దినోత్సవం ముందస్తు సంబరాల్లో భాగంగా బుధవారం రాపూరులోని జెమ్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు 150 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శించారు. కొంతమంది చిన్నారులు స్వాతంత్య్ర సమరయోధుల వేషధారణతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మునీంద్రరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం పలువురు నాయకులు, విద్యార్థులతో కలిసి నాయుడుపేటలో భారీ ర్యాలీ చేపట్టారు. గాంధీ పార్కు నుంచి పాత బస్టాండు అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. అక్కడ మానవ హారం ఏర్పాటుచేశారు. టీఎంఆర్ విద్యా సంస్థల డైరెక్టర్ తంబిరెడ్డి మనోహర్ రెడ్డి, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఇరకం దీవిలో జాతీయ జెండా రెపరెపలు


తడ: ఇరకం దీవిలో గ్రామస్తులు విద్యార్థులతో కలిసి బుధవారం జాతీయ జెండాను రెపరెపలాడించారు. దీవికి చెందిన యువకులు గ్రామం నుంచి పులికాట్ సరస్సు మీదుగా పడవల ద్వారా సమీపంలోని బీవీపాళెం, సున్నపుగుంట గ్రామాలో పాఠశాలల విద్యార్థులతో కలిసి జెండాలు చేతపట్టి నినాదాలు చేశారు. మత్స్యకారులు సైతం జెండాలు చేతబట్టి నినాదాలు చేస్తూ తమ దేశ భక్తిని చాటారు.

దేశ నాయకుల సైకత శిల్పాలు

చిల్లకూరు: గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో గురువారం స్వాతంత్య్ర దినోత్సవం నిర్వహించనున్నారు. ఈ క్రమంలో సైకత శిల్పి మంచాల సనత్‌కుమార్ దేశ నాయకులు నేతాజీ సుభాష్ చంద్రబోస్, మహాత్మా గాంధీ, జవరహర్‌లాల్ నెహ్రూ సైకత శిల్పాలను రూపొందించారు.











స్వాతంత్య్ర దిన వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం

చిల్లకూరు: గూడూరులో స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని ఆర్డీవో కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆయన బుధవారం డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో నిర్వహించే వేడుకల్లో గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, సత్యవేడు ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలిపారు. ఇందులో పలు శాఖలకు చెందిన పది శకటాలను ఏర్పాటు చేస్తున్నామని, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన ఉద్యోగులతోపాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్వాతంత్య్ర సమరయోధులను సత్కరిస్తామన్నారు. అన్ని శాఖల అధికారులు స్టాళ్లు ఏర్పాటుచేయాలని సూచించారు. గూడూరు డీఎస్పీ రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్ సెట్ వితరణ

చిల్లకూరు: కడివేడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు బుధవారం గూడూరుకు చెందిన ప్రగతి సేవా సంస్థ మైక్ సెట్ ను బహూకరించింది. సంస్థ నిర్వాహకులు కడివేటి చంద్రశేఖర్, ప్రతినిధులు పోలిరెడ్డి పెంచలయ్య, కోట వెంకటేశ్వర్లు, నారాయణ, నాగరాజు, తూపిలి యశ్వంత్ చిన్న, శ్రావణ, హెచ్‌ఎం సుజీవని పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి మృతి



వెంకటరెడ్డి(ఫైల్)

దక్కిలి: మండలంలోని మాటుమడుగు గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ పోలంరెడ్డి వెంకటరెడ్డి బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మాటుమడుగు గ్రామ సర్పంచ్‌గా, వడ్ల మోపూరు సొసైటీ అధ్యక్షుడిగా పని చేశారు. ఆయన పార్థివదేహాన్ని పలువురు వైఎస్సార్ సీపీ, టీడీపీ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. గురువారం ఉదయం 9 గంటలకు స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని బంధువులు తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

గూడూరు రూరల్: కోర్టు సెంటర్ వద్ద బుధవారం కంకర లోడుతో వెళుతున్న లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. లారీ చెన్నూరు వైపు నుంచి గూడూరు వైపు వెళుతోంది. కోర్టు సెంటర్ వద్ద డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల లారీ అదుపు తప్పి రోడ్డు మధ్యలో స్తంభాన్ని ఢీకొంది. లారీ ముందు చక్రాలు ఊడి పోవడంతో అక్కడికక్కడే నిలిచిపోయింది. ట్రాన్స్‌కో ఏఈ ఏడుకొండలు విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. అనంతరం విద్యుత్ తీగలను తప్పించారు.

ఎట్టకేలకు బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్

పెళ్లకూరు: మండల రెవెన్యూ శాఖలో అవినీతి పెచ్చుమీరడంతో అవినీతి నిరోధక శాఖ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. దీంతో అధికారులు పెళ్లకూరుకు బదిలీపై రావడానికి సాహసించలేదు. ఈ క్రమంలో ఎట్టకేలకు తహసీల్దార్ ద్వారకనాథ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన శ్రీకాళహస్తి రెవెన్యూ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన

కలువాయి: వరి, వేరుశనగకు ఆశించే పురుగులు, సోకే తెగుళ్లు, తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు వ్యవసాయశాఖ అధికారులు బుధవారం అవగాహన కల్పించారు. మాదన్నగారిపల్లిలో రైతులు సాగు చేసిన వరి పంటను పరిశీలించారు. ఏడీఏ శివనాయక్, కేవీకే శాస్త్రవేత్తలు కిరణ్, నర్సిరెడ్డి, ఎస్‌వో శశికాంత్, ఏవో ప్రతాప్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత ఫెన్సింగ్ రాళ్లు ధ్వంసం

ఓజిలి: మాచవరంలో వైఎస్సార్ సీపీ నేత పాదర్తి మస్తాన్‌నాయుడుకు చెందిన పొలంలో వేసిన ఫెన్సింగ్ రాళ్లను బుధవారం టీడీపీ నేతలు ధ్వంసం చేశారు. ఆయన మాట్లాడుతూ తనకు సర్వే నంబర్లు 35-3, 37-2, 160-2లలో 20 ఎకరాలు భూమి ఉందని తెలిపారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కోసం పనిచేశానన్న అక్కసుతో తన భూమి చుట్టూ వేసిన సుమారు 400 ఫెన్సింగ్ రాళ్లను టీడీపీ నేతలు ధ్వంసం చేశారని వాపోయారు. సుమారు రూ.4 లక్షల వరకు నష్టం సంభవించినట్టు తెలిపారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

18న తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సు

రాపూరు: రాపూరు నుంచి తిరువణ్ణామలై, సిరిపురానికి 18న ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ అనీల్‌కుమార్ తెలిపారు. ఈ బస్సు పొదలకూరులో ఆదివారం ఉదయం 9 గంటలకు బయలుదేరి రాపూరు, దక్కిలి మీదుగా తిరువణ్ణామలై వెళుతుందని వెల్లడించారు. టికెట్ ధర రూ.1200లని తెలిపారు. ముందుగానే రిజర్వేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7382886451లో సంప్రదించాలని కోరారు.

ఘనంగా ఎన్‌బీకేఆర్‌లో ఫ్రెషర్స్ డే

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో బుధవారం ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీటెక్ ఫస్టియర్‌లో చేరిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలకు న్యాక్, ఎన్‌బీఏ సంస్థల గుర్తింపు ఉన్నట్టు తెలిపారు. అత్యున్నత ప్రమాణాలతో విద్య అందిస్తున్నట్టు తెలిపారు. కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కళాశాల అభివృద్ధి కృషి చేస్తున్నారని తెలిపారు.







